సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 17 । జనవరి । 2023





అశ్వవాహనంపై ఖాద్రీశుడు

న్యూస్‌రీల్

నేడు స్పందన

పుట్టపర్తి టౌన్: కనుమ నేపథ్యంలో సోమవారం రద్దు చేసిన 'స్పందన' కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలో మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. అర్జీదారులు తమ వినతి పత్రంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్సు, ఫోన్ నంబరు తప్పని సరిగా పొందుపరచాలని సూచించారు. కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అర్జీదారులంతా నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి, సామాజిక దూరం పాటించాలని కోరారు.

తగ్గని చలి ప్రభావం

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలోని చాలా మండలాల్లో రాత్రిళ్లు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో చలి ప్రభావం తగ్గలేదు. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు చలి వణికిస్తోంది. సోమవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 9.2 డిగ్రీలు, అగళిలో 8.5 డిగ్రీలు, అనంతపురం జిల్లా శెట్టూరులో 10.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రొద్దం 9.6 డిగ్రీలు, తనకల్లు 10.2, కొత్తచెరువు 10.4, నల్లచెరువు 10.5, కనగానపల్లి 10.5, రాప్తాడు, హిందూపురం, బెళుగుప్ప 11, రాయదుర్గం, సోమందేపల్లి 11.1, పరిగి 11.3, తాడిమర్రి 11.8, తలుపుల, కూడేరు 11.9 డిగ్రీల కనిష్టం నమోదు కాగా.. మిగతా మండలాల్లో 12 నుంచి 16 డిగ్రీల మధ్య కొనసాగాయి.

జిల్లా హాకీ జట్టుకు కాంస్యం

ధర్మవరం: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నంద్యాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీల్లో జిల్లా జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన సెమీఫైనల్స్‌లో అనకాపల్లి జట్టుతో తలపడి ఓటమి చవిచూసింది. అనంతరం మూడో స్థానం కోసం వైఎస్సార్ జిల్లా జట్టుతో పోటీ పడింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1–1 స్కోరు చేశాయి. కానీ పెనాల్టీ షూటౌట్‌లో జిల్లా జట్టు 2–1 స్కోరు తేడాతో విజయం సాధించి కాంస్య పతకం దక్కించుకుంది. జిల్లా జట్టును హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్, కోచ్ హుస్సేన్ అభినందించారు.



పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్) కదిరి కొండ వద్ద కొలువుదీరిన ఖాద్రీశుడు

పార్వేట ఉత్సవం.. భక్తి పారవశ్యం

- కనుల పండువగా నృసింహుని పార్వేట ఉత్సవం
- కుందేలును పట్టుకోవడానికి ఎగబడిన భక్త జనం
- తిరువీధుల్లో అశ్వవాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు
- చోర సంవాదంతో ముగిసిన ఉత్సవం

నమో.. నారసింహా



శ్రీవారి పల్లకీ మోస్తున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి: ఓ చేత విల్లు..మరో చేత బాణం ధరించి పార్వేటకు వచ్చిన ఖాద్రీశుణ్ని భక్త జనం 'నమో నారసింహా' అంటూ కీర్తించారు. ఏటా కనుమ పండుగ రోజున ఖాద్రీశుని పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి పార్వేట ఉత్సవం భక్త జనుల కోలాహలం మధ్య కనుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి నిత్య పూజలు నిర్వహించిన అనంతరం శ్రీవారు స్తోత్రాద్రి(కదిరి కొండ) వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన అర్చకులు అక్కడికి విచ్చేసిన భక్తులకు పార్వేట ఉత్సవ విశిష్టతను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కదిరి కొండ వద్దకు చేరుకొని శ్రీవారి పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారి పల్లకీని మోశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులతో పాటు ఆలయ కమిటీకి సూచించారు.

పాల పొంగుల ఉత్సవం

కదిరి కొండ వద్ద పూజలు ముగించుకున్న శ్రీవారు కుమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న పాలు ఆరగింపు మంటపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఆచారం ప్రకారం యాదవులు స్వామివారికి పాల పొంగులు నిర్వహించారు. నారసింహుడు పాలు ఆరగించిన తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు.

కోలాహలంగా పార్వేట

పాలపొంగుల ఉత్సవం ముగిసిన తర్వాత స్వామి వారు సాయం సంధ్య వేళలో రైల్వే స్టేషన్ సమీపంలోని పార్వేట మండపం వద్దకు చేరుకున్నారు. తర్వాత రైలు కట్ట వద్ద ఎప్పటి లాగానే ఆచారం ప్రకారం కుందేలును జనం మధ్యకు వదిలారు. అది పరుగులు తీయగా... భక్తులు దాని వెంట పడి పట్టుకున్నారు. శరీర భాగాలను తలా ఓ ముక్క లాక్కున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఒకటి తర్వాత మరొకటి చొప్పున ఎక్కువ కుందేళ్లను వదిలారు. ఆ సమయంలో కాసేపు యువత మధ్య తోపు లాటలు జరిగాయి. పోలీసులు కలుగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. పార్వేట పూర్తి కాగానే నారసింహుడు రాయచోటి రోడ్‌లోని శమీ మండపం వద్దకు చేరుకొని అక్కడ పూజలు అందుకున్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన శ్రీవారు

అనంతరం శ్రీవారు విశేషాలంకరణతో అశ్వవాహనంపై పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తిరిగి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద చోరసంవాదం నిర్వహించిన తర్వాత స్వామివారు ఆలయంలోకి ప్రవేశించడంతో పార్వేట ఉత్సవం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులే కాకుండా కర్ణాటక నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి పార్వేట ఉత్సవంలో తమ ఇష్ట దైవం ఖాద్రీ నారసింహున్ని దర్శించు కున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. కదిరి డీఎస్పీ భవ్య కిశోర్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాయి కీర్తి..భక్త జనకోటి



అలంకరణలో సత్యసాయి మహాసమాధి



రామాయణంలోని ఓ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

- ప్రశాంతి నిలయంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



హిరణ్య కశిపుడిని సంహరించే ఘట్టం

ప్రశాంతి నిలయం: భక్తకోటి సాయినామస్మరణ మధ్య ప్రశాంతి నిలయంలో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు యజుర్వేద మందిరం నుంచి బ్రాస్‌బ్యాండ్ వాయిద్యంతో సత్యసాయి పల్లకీని మోస్తూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం సత్యసాయిని, సర్వ దేవతలను కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా సత్యసాయి క్రీడా సాంస్కృతిక సమ్మేళనంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ చక్రవర్తి ట్రోఫీలను ప్రదానం చేశారు. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో సాధించిన విజయాలను, సమాజానికి అందించిన సేవలను వివరిస్తూ 'ధీమహీ' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని రత్నాకర్ రాజు అవిష్కరించారు. సాయంత్రం 'భక్తి సారాంశం' పేరుతో విద్యార్థులు నిర్వహించిన నాటిక భక్తులను పరవశింపజేసింది. ప్రధానంగా భక్తప్రహల్లాదుడు భక్తికి మెచ్చి నారసింహుని రూపంలో వచ్చి హిరణ్య కశ్యపుడిని సంహరించే ఘట్టాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. సీతారాముల కల్యాణ ఘట్టాన్ని చక్కగా ప్రదర్శించి ఆహూతులను అలరించారు.

జిల్లాలో కార్ల షోరూమ్ కంపెనీలు	10కి పైనే
కనిష్టంగా కారు విలువ	రూ.7 లక్షలు
గరిష్టంగా	రూ.40 లక్షలు
నెలకు సరాసరి అమ్మకాలు	400 పైనే
నెలకు కార్ల అమ్మకాల టర్నోవర్	రూ.320 కోట్లు
ఏడాదికి సగటున అమ్మకాల విలువ	రూ.3800 కోట్లు



దూసుకెళ్తున్న కార్లు

- జిల్లాలో నెలకు సగటున 400 కార్ల విక్రయాలు
- ఐదేళ్ల కిందట నెలకు 80 కార్లు అమ్మడైతే గొప్ప
- ఏడాదికి రూ.3,800 కోట్లకు పైగా టర్నోవర్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కార్ల అమ్మకాలు దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పుడు నాలుగు చక్రాల వాహనాలకు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు కారు హోదాగా భావించే సగటు కుటుంబాలు.. ఇప్పుడు నిత్యావసరంగా భావిస్తున్నాయి. సొంత ఇల్లు ఎంత ముఖ్యమో కారు ఉండటమూ అంతేననే ఆలోచన ఏర్పడింది. ముఖ్యంగా కోవిడ్ అనంతరం చిన్న చిన్న ఉద్యోగులు కూడా కారు వైపు మొగ్గు చూపుతున్నారు. కుటుంబంతో కలిసి సొంతకారులో ప్రయాణించాలన్న ఆలోచన బలంగా ఏర్పడింది.

కార్లకు భారీ డిమాండ్..

ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా కేంద్రంగా మహా అంటే నెలకు 80 నుంచి 100 కార్లు అమ్ముడయ్యేవి. తాజా గణాంకాలు చూస్తే నెలకు 400కు పైగా అమ్ముడవుతున్నాయి. దీన్నిబట్టి కార్ల డిమాండ్ ఎలా ఉందో అంచనా వేయచ్చు. కియా, మహీంద్రా, హ్యుందాయ్, మారుతి, టాటా వంటి కార్లకు బాగా డిమాండ్ ఉంది. కారు బుక్ చేసుకున్న తర్వాత కనీసం మూడు మాసాలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నట్టు షోరూం నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని కార్లకు 6 మాసాలు కూడా పడుతోంది. పండుగలు, ప్రత్యేక పర్వదినాల వేళ 500 కార్లు అమ్ముడైన సందర్భాలున్నాయి.

కుటుంబ ప్రయాణాలపై మొగ్గు..

ఒకప్పుడు బస్సు, రైలు ప్రయాణాలు ఎక్కువ. ఇప్పుడు రూ.40 వేలు వేతనం తీసుకునే ఉద్యోగి కూడా కుటుంబంతో కలిసి ప్రయాణం చేయాలనుకుంటున్నారు. దీంతోపాటు సులభతర వాయిదాల్లో లోన్లు లభిస్తున్నాయి. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో కార్లలో ప్రయాణమే మంచిదన్న అభిప్రాయంలో ఉన్నారు. కొత్త కార్లకే కాదు సెకండ్ హ్యాండ్ కార్లకూ ఇప్పుడు మంచి మార్కెట్ ఉన్నట్టు ఆటోమొబైల్ నిపుణులు చెబుతున్నారు.

కొనుగోలు శక్తి పెరిగింది

ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగింది. చిన్న చిన్న ఉద్యోగులు కూడా కారు కొనుక్కోవాలనే ఆలోచనలో ఉన్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు చాలా ఎక్కువ మార్కెట్ ఉంది. ముఖ్యంగా కోవిడ్ అనంతరం జిల్లాలో కార్ల అమ్మకాల మార్కెట్ పెరిగింది.

– వంశీ, జనరల్ మేనేజర్, మహీంద్రా కంపెనీ

అక్కడ జాప్యం జరుగుతోందని..

మాది కృష్ణా జిల్లా కలిదిండి. మహీంద్రా ఎక్స్‌యూవీ 700 కొనాలనుకున్నా. కానీ విజయవాడలో 7 మాసాలు వెయిటింగ్ అని చెప్పారు. తెలిసిన వాళ్లుంటే అనంతపురంలో కొన్నా.

– ఎం.నాగరాజు, కలిదిండి


ఆదాయం పెరిగింది

రవాణాశాఖకు ఆదాయం పెరుగుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 206.42 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. డిసెంబర్ నాటికి రూ.154 కోట్లు టార్గెట్ కాగా, రూ. 132 కోట్లు వసూలైంది. ఇందుకు కారణం వాహనాల కొనుగోలు పెరగడమే. ముఖ్యంగా కార్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

– శివరామప్రసాద్, డీటీసీ, అనంతపురం

నైపుణ్యాభివృద్ధికి శ్రీకారం

- విద్యా సామర్థ్యాల పెంపునకు చర్యలు
- మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఎల్‌ఐపీ
- 335 ఉన్నత పాఠశాలల్లో సైన్స్ క్లబ్బులు
- క్రీడల నిర్వహణకు రూ.3.54 కోట్ల నిధులు



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

అనంతపురం: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస భాషా పరిజ్ఞానం, అంక గణిత సామర్థ్యాల పెంపునకు చర్యలు చేపట్టింది. అభ్యసనా సామర్థ్యాల్లో వెనుకబడిన పిల్లలకు ఆయా కార్యక్రమాల ద్వారా శాస్త్రీయ విద్య అలవడేలా కృషి చేస్తోంది. ప్రాథమిక స్థాయిలో మూడో తరగతిలోపు చదువుతున్న 90,587 మంది విద్యార్థులకు భాషా నైపుణ్యాల పెంపునకు రోజుకు ఒక కొత్త పదం నేర్చుకునేలా ఎల్‌ఐపీ (లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్) నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు రోజూ తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయా కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతో పాటు జిల్లాలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 1,52,759 మంది విద్యార్థులకు పిక్టోరల్ డిక్షనరీలు అందించారు.

శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించేలా..

లెక్కలు, సైన్స్ సబ్జెక్టులపై భయాన్ని తొలగించి ఆసక్తి పెంచేలా ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 335 ఉన్నత పాఠశాలల్లో సైన్స్, లెక్కల క్లబ్బులు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణకు ప్రతి పాఠశాలకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించింది. విద్యార్థులు భవిష్యత్తులో ఏ కోర్సు ఎంపిక చేసుకుంటే అవకాశాలు ఎలా ఉంటాయనే అంశంపై అవగాహన కల్పించేందుకు హైస్కూల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంకు రూపకల్పన చేసి ఆన్‌లైన్‌లో అమలు చేస్తోంది.

క్రీడా నైపుణ్యాలు పెంపొందించేలా...

క్రీడలతోనే మానసిక వికాసం సాధ్యమనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. తాజాగా జిల్లా, రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో క్రీడా పరికరాలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ నిర్వహణకు రూ.3.54 కోట్ల నిధులు విడుదల చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు మొత్తం 586 పాఠశాలలు ఉండగా, రూ.1.46 కోట్ల నిధులు విడుదల చేసింది. 12వ తరగతి వరకు ఉన్న సీనియర్ సెకెండరీ పాఠశాలలకు రూ.28 లక్షల నిధులు వచ్చాయి. మొత్తం 2,730 ప్రాథమిక పాఠశాలలకు రూ.1.36 కోట్లు, మొత్తం 434 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.43.40 లక్షల నిధులు అందాయి. మొత్తం అన్ని పాఠశాలలకు కలిపి 3.54 కోట్ల నిధులతో పాఠశాల క్రీడా పరికరాల వినియోగానికి వెచ్చించవచ్చు.


భాషలపై ప్రత్యేక తర్ఫీదు

తెలుగు, ఇంగ్లిష్, హిందీ వంటి భాషలు నేర్చుకుంటే భాషా సామర్థ్యాలు అలవడతాయి. తద్వారా విద్యార్థిలో మానసిక వికాసంతో పాటు సృజనాత్మకత ఆలోచనలు రావడానికి వీలు కలుగుతుంది. ఈ నేపథ్యంలో పునాది స్థాయి నుంచే విద్యార్థికి భాషలపై పట్టు సాధించే రీతిలో ప్రత్యేక తర్ఫీదునిస్తున్నాం. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు రూ.3.54 కోట్ల నిధులు విడుదల అయ్యాయి.

– కె.తిలక్ విద్యాసాగర్, ఏపీసీ, సమగ్రశిక్ష

ఫ్లోరైడ్ రహిత నీటిని అందించేందుకు కృషి

- హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్



వాటర్ రీసోర్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: ఫ్లోరైడ్ నీటితో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా గ్రామాల వారు ఇబ్బందులు పడుతున్నారని, నీటిని ప్రాసెస్ చేసి మంచినీటిగా మార్చే ప్రక్రియపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ అన్వేషిస్తోందని ఎంపీ గోరంట్ల మాధవ్ తెలిపారు. నీటివనరులు పెంపొందించుకోవడంపై సోమవారం కోల్‌కతాలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప్పునీటిని మంచినీరుగా మార్చుకునే అంశంపై నిపుణులతో చర్చించినట్లు ఎంపీ వెల్లడించారు. భూమిపై ఉన్న నీటిలో ప్రస్తుతం 3 శాతం మాత్రమే తాగునీటికి ఉపయోగపడుతోందని, మానవ అవసరాలకు మరింత ఎక్కువ నీటిని మంచినీరుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని నిపుణుల కమిటీ తేల్చిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఉప్పునీటిని మంచినీరుగా మార్చి తాగు, సాగునీటికి అవసరాలకు ఉపయోగించుకు అవకాశాలపై సమావేశంలో చర్చించినట్లు ఎంపీ వెల్లడించారు. అనంతరం సముద్రపు నీటిని ప్రాసెస్ చేసి స్వచ్ఛమైన నీటిని అందిస్తున్న 'సీ వాటర్ డిశాలినేషన్ వాటర్ ప్లాంట్'ను కమిటీ పరిశీలించిందన్నారు.

బొమ్మను చేసి.. ప్రాణం పోసి


అమ్మకానికి ఉంచిన బొమ్మలు


బొమ్మలకు రంగులు అద్దుతున్న రాజస్తాన్‌వాసులు


ఆరబెట్టిన బొమ్మలు

- జీవం ఉట్టిపడుతున్న బొమ్మలు
- పుట్టపర్తి కేంద్రంగా నైపుణ్యం చాటుతున్న రాజస్తానీలు

పుట్టపర్తి అర్బన్: విద్యాభ్యాసానికి వారు దూరం! పుట్టింది మొదలు... చచ్చే వరకూ సంచార జీవనం. తాము ఎక్కడుంటే అదే వారి ప్రాంతం.. అక్కడే గూడు. పొట్టకూటి కోసం బొమ్మల తయారీ. కళాపోషకులు ఆదరిస్తే బతుకు.. లేదంటే పస్తు. ఇది వలస వచ్చిన రాజస్తానీయుల జీవనం. దేవుడి చేతిలో ప్రాణులు జీవం పోసుకుంటే... రాజస్తానీల చేతిలో మాటలు రాని బొమ్మలు పురుడు పోసుకుంటున్నాయి. పుట్టపర్తి కేంద్రంగా కొంత కాలంగా రాజస్తానీయులు తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని బొమ్మల తయారీతో జీవనం సాగిస్తున్నారు.

జోద్‌పూర్ నుంచి రాక

రాజస్తాన్‌లోని జోద్‌పూర్‌కు చెందిన పలువురు మూడు నెలల క్రితం పుట్టపర్తికి చేరుకున్నారు. పట్టణ శివారులో తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గృహాలంకరణ బొమ్మల తయారీ చేపట్టారు. వీరిలో ఏ ఒక్కరికీ అక్షరం ముక్కరాదు. తెలుగు అర్థం చేసుకుంటారు కానీ మాట్లాడడం రాదు. కేవలం రాజస్తానీ, హిందీ తప్ప మరో భాష రాదు. అయినా.. చేతిలో పని ఉంటే చాలు గౌరవ బతికేందుకు భాష అడ్డం రాదని నిరూపిస్తున్నారు. దాదాపు 50 రకాల బొమ్మలను జీవం ఉట్టిపడేలా చేస్తున్నారు. బొమ్మ పరిమాణాన్ని బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు అమ్ముడుబోతోంది.

ఆంధ్రుల ఆదరణ మరువలేం

తమ ప్రాంతంలోని వందలాది కుటుంబాలు వలస జీవులుగా బతుకుతున్నాయని పుట్టపర్తికి వచ్చిన రావత్‌రాం, పప్పూరాం, హరిరాం, సీత, శాంతిలాల్ తెలిపారు. పదేళ్లుగా తాము ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, ఈ నేపథ్యంలోనే చాలా పట్టణాలు, నగరాలు చుట్టేసి వచ్చినట్లు వివరించారు. ఎక్కడికెళ్లినా.. శివారు ప్రాంతంలోని విశాలమైన మైదాన ప్రాంతాన్ని అద్దెకు తీసుకుని గుడారం ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఏపీలోనే తమకు మంచి ఆదరణ ఉంటోందని, దీంతో నెలల తరబడి ఈ ప్రాంతాల్లోనే జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తయారైన విగ్రహాలను రోడ్డు పక్కన ప్రదర్శనకు ఉంచడం ద్వారా కొన్ని, రిక్షాలలో ఉంచుకుని కాలనీల్లో తిరుగుతూ మరికొన్ని విక్రయిస్తున్నామన్నారు. పెట్టుబడులు పోను రోజుకు రూ.1 వెయ్యి నుంచి రూ.2వేల వరకు మిగులుతుందన్నారు.

శిల్పారామం అభివృద్ధికి చర్యలు


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, సతీమణి అపర్ణారెడ్డి


సంక్రాంతి సంబరాలకు హాజరైన ప్రజలు

పుట్టపర్తి టౌన్: స్థానిక శిల్పారామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. పుట్టపర్తిలోని ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో శనివారం ప్రారంభమైన సంక్రాంతి సంబరాల కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముగ్గుల పోటీలు, పాడి పంటలు, సంప్రదాయ వంటకాల స్టాల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు పులివెందులకు చెందిన మాస్టర్ అస్లాం బృందం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల కోలాటాలు, సంగీతకచేరి, గొరవయ్యల నృత్యాలు, సూర్య అకాడమీ డ్యాన్సులు, శాస్త్రీయ నృత్యాలతో కళాకారులు సందడి చేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి అపర్ణా రెడ్డి హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలను అభినందిస్తూ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను సందడిగా నిర్వహించడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ రమేష్ రెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మండల మాజీ కన్వీనర్ గంగాద్రితో పాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పరిగి: మండలంలోని మోదా గేట్‌లో నివాసముంటున్న జగదీష్(30) పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మోదా పంచాయతీ పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన స్వప్నను జగదీష్ వివాహం చేసుకున్నాడు. భార్యతో కలసి మోదా గేట్‌లో నివాసముంటూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. కుటుంబపోషణ, ఇతర అవసరాల కోసం అప్పులు చేశాడు. ఇటీవల వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఆదివారం ఇంట్లో క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగదీష్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఫేషియల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, కింది స్థాయి సిబ్బంది అందరూ ఫేషియల్ అటెండెన్స్‌కు సంబంధించిన ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ ఉదయం 10.10 గంటల్లోగా, సాయంత్రం 5.30 గంటల తరువాత అటెండెన్స్ వేయాల్సి ఉంటుందని తెలిపారు. జీతభత్యాలకు సంబంధించిన అన్ని వ్యవహారాలు ఈ యాప్‌కు లింక్ అయి ఉంటాయని వివరించారు. మంగళవారం నుంచి యాప్‌లోనే అటెండెన్స్ వేయాలని సూచించారు.

క్లుప్తంగా

రైలు ఢీ కొని 53 గొర్రెలు మృతి


పట్టాల పక్కన పడి ఉన్న గొర్రెల కళేబరాలు

బత్తలపల్లి: రైలు ఢీకొన్న ఘటనలో 53 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వివరాలు.. బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన సుధాప్రసాద్, చెడిపోతుల నారాయణప్ప.. ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 6 లక్షలు అప్పు చేసి 60 గొర్రెలను కొనుగోలు చేసి, పోషణ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలోని రైలు పట్టాల వద్ద పొలంలో మేస్తున్న గొర్రెలు.. ఉన్నఫళంగా రైలు హారన్ శబ్దానికి బెదిరి పట్టాలపై ఎక్కాయి. అదే సమయంలో ధర్మవరం నుంచి తిరుపతి వెళుతున్న రైలు దూసుకెళ్లడంతో 53 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనలో రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ముసలయ్య, నారాయణస్వామి తదితరులు అక్కడకు చేరుకుని బాధిత కాపరులకు ధైర్యం చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వృద్ధుడి మృతి

పెనుకొండ: ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ సమీపంలోని సీఫారం ప్రాంతానికి చెందిన నారాయణప్ప (60) సోమవారం ఉదయం వ్యక్తిగత పనిపై హిందూపురానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. పెనుకొండలోని ఆర్టీసీ బస్టాండు వద్దకు చేరుకోగానే హిందూపురం నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న బస్సు బస్టాండులోకి మలుపు తిరుగుతుండగా ద్విచక్ర వాహనంతో నారాయణప్ప ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన నారాయణప్పను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీ - పలువురికి గాయాలు

తాడిమర్రి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దకోట్ల గ్రామానికి చెందిన బేల్దారి మంజుల గంగాధర్ కుమారులు జయప్రజ్ఞ, జయచంద్, సోమశేఖర్ కుమారుడు అశ్వత్థ ముగ్గురూ పదిహేళ్లలోపు వయసున్న పిల్లలు. ఆదివారం మధ్యాహ్నం వీరు ముగ్గురూ తాడిమర్రిలో మ్యాట్నీ చూసేందుకు వచ్చారు. సినిమా వదిలిన తర్వాత సాయంత్రం 6.30 గంటలకు గ్రామానికి వెళ్లేందుకు థియేటర్ వద్ద ఆటో కోసం వేచి ఉండగా.. అదే సమయంలో గంగాధర వద్దకు బేల్దారి పనులకు వస్తున్న తాడిమర్రి నివాసి సాకే నాగరాజు కనిపించడంతో పిల్లలు తమను ద్విచక్ర వాహనంపై గ్రామానికి చేర్చాలని కోరారు. దీంతో ఆయన ముగ్గురు పిల్లలను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళుతుండగా మార్గమధ్యంలో బంగారం పేట వద్దకు చేరుకోగానే ఎదురుగా పెద్దకోట్లకు చెందిన చిన్న పెద్దన్న ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొన్నాడు. ఘటనలో వాహనచోదకులతో పాటు సోమశేఖర్‌కు శరీరంపై, జయప్రజ్ఞ తలకు గాయాలయ్యాయి. అశ్వత్థ చెయ్యి విరిగింది. కుటుంబసభ్యులు వెంటనే క్షతగాత్రులను అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై తాడిమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

10 మంది జూదరుల అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రొద్దం: మండలంలోని వైటీ రెడ్డిపల్లి సమీపంలో ఆదివారం కోడిపందెలు ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.28 వేలు నగదు, ఐదు పందెం కోళ్లు, 12 కత్తులు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి


పావగడ: కారు ఢీ కొనడంతో దెబ్బతిన్న ఆటో (ఇన్‌సెట్) మృతుడు వర్షిత్ రెడ్డి

పావగడ: కారు ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిత్రదుర్గం జిల్లా గౌరీపుర గ్రామానికి చెందిన పలువురు ఆదివారం పావగడకు వచ్చారు. రాత్రి ఆటోలో వీరు ప్రయాణమయ్యారు. పావగడ తాలూకా పరిధిలోని టీఎన్‌పేట వద్దకు చేరుకోగానే ప్రయాణికులను దింపుతున్న సమయంలో శ్రీసత్యసాయి జిల్లా రొద్దం నుంచి పావగడ వైపు వేగంగా వస్తున్న ఇన్నోవా కారు వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో ఆటోలో ఉన్న గౌరీపుర నివాసులు నరసమ్మ, సుధ, జశ్వంత్, బ్యాడనూరు లక్ష్మీదేవి, టీఎన్‌పేట శాంతమ్మ, గౌరాజుపల్లి నారాయణప్ప, వర్షిత్‌రెడ్డి (13) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. రెండు కాళ్లు విరిగి, విషమ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న వర్షిత్‌రెడ్డిని బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక వర్షిత్‌రెడ్డి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఇన్నోవా డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పావగడ పోలీసులు తెలిపారు.

పండుగ పూట విషాదం


హనుమంతరాయ (ఫైల్)

అమరాపురం: గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పండుగ పూట ఆ గ్రామంలో విషాదం నెలకొంది. అత్యధికులు సంక్రాంతి సంబరాలను రద్దు చేసుకున్నారు. వివరాలు.. అమరాపురం మండలం గౌడనకుంట గ్రామానికి చెందిన హనుమంతరాయ (20) బెంగళూరులోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ఆదివారం గ్రామంలో జరిగే సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు తన స్నేహితుడు పవన్‌తో కలసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాత్రి 10 గంటలకు మార్గ మధ్యంలోని డాబస్‌పేట దాటిన తర్వాత ఉన్నఫలంగా ఓ కారు ఎడమ పక్కకు రావడంతో వేగంగా వెళుతున్న బైక్ అదుపు తప్పి కారును ఢీ కొంది. ఘటనలో కిందపడి తీవ్రంగా గాయపడిన హనుమంతరాయ, పవన్‌ను స్థానికులు తుమకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే హనుమంతరాయ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పవన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు వెంటనే తుమకూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనపై క్యాత్సంద్ర పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, హనుమంతరాయ మృతిచెందినట్లు తెలుసుకున్న గ్రామస్తులు కొందరు ఆదివారం సంక్రాంతి సంబరాలను రద్దు చేసుకున్నారు. హైదరాబాద్, విజయవాడ, అనంతపురం, పుట్టపర్తి, కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు, తుమకూరు, దావణగెర తదితర ప్రాంతాల్లో ఉన్న గౌడనకుంట యువకులు, కుటుంబసభ్యులు.. హనుమంతరాయ కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆదివారం సాయంత్రం హనుమంతరాయ అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


గాయపడిన మహేష్

కనగానపల్లి: మండలంలో ఆది, సోమవారాల్లో చోటు చేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. మామిళ్లపల్లి సమీపంలోని ధర్మవరం రహదారిలో ఆదివారం రాత్రి ఆటో బోల్తా పడి అనంతపురానికి చెందిన దంపతులు గాయపడ్డారు. మామిళ్లపల్లి సమీపంలోనే సోమవారం 44వ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడరును ఢీకొన్న ఘటనలో అనంతపురానికి చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ అమర్‌తేజ స్వల్పంగా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం పర్వతదేవరపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళుతూ అదుపు తప్పి కింద పడిన ఘటనలో రామగిరి మండలం దుబ్బార్లపల్లి నివాసి మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పెట్రోలింగ్ వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

ఎన్పీకుంట: మండలంలోని గూటిబైలు పరిసర ప్రాంతంలో కోడి పందెం ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సద్గురుడు సోమవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.4,600 నగదుతో పాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ప్రాణం ఖరీదు రూ.లక్ష!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరుగులు తీస్తున్న నేటి రోజుల్లో రాతియుగం నాటి అనాగరిక సంస్కృతికి తెరలేపారు కొందరు. వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందితే... రూ.లక్ష పరిహారం చెల్లించేలా దుప్పటి పంచాయితీ చేశారు. పెద్దల పంచాయితీకి వైద్యాధికారులు, పోలీసులూ తలొగ్గారు. ఆదివారం నిశిరాత్రి జరిగిన ఈ దారుణం సోమవారం తెల్లారేసరికి గుట్టుచప్పుడు కాకుండా తొక్కేశారు.

- సూది మందు వికటించి వ్యక్తి మృతి
- పంచాయితీతో ధర నిర్ణయించిన వైనం


మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య (చిత్రంలో) కుమారుడు

గుత్తి రూరల్: సూది మందు వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తొండపాడుకు చెందిన నల్లబోతుల రంగయ్య (45), సునీత దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ రంగయ్య కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జ్వరంతో బాధపడుతున్న రంగయ్య ఆదివారం రాత్రి కుమారుడు సాయంతో గుత్తిలో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కృష్ణప్రసాద్ నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. డాక్టర్ సూది మందు వేసిన కాసేపటికి రంగయ్య అపస్మారకస్థితికి చేరుకున్నాడు. దీంతో వైద్యుడి సూచన మేరకు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అప్పటికే రంగయ్య మృతి చెందాడు. దీంతో డాక్టర్ కృష్ణప్రసాద్ వైద్యం సరిగా చేయకపోవడం వల్లనే రంగయ్య మృతి చెందాడంటూ బంధువులు, కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. అప్పటికే అక్కడకు చేరుకున్న డాక్టర్ కృష్ణప్రసాద్‌పై దాడికి యత్నించారు. సకాలంలో అక్కడకు చేరుకున్న సీఐ వెంకటరామిరెడ్డి, సిబ్బంది వెంటనే ఆందోళనకారులను చెదరగొట్టారు.


డ్యూటీ సమయంలో ప్రైవేట్ క్లినిక్‌లో

ఇటీవల బదిలీపై గుత్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కృష్ణప్రసాద్.. స్థానికంగానే ఓ ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తూ అదనపు ఆదాయంపై దృష్టిసారించారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కాల్ డ్యూటీలో ఉన్న ఆయన... తన సొంత క్లినిక్‌లో పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న రంగయ్య కుటుంబసభ్యులు నేరుగా ప్రైవేట్ క్లినిక్‌కు చేరుకున్నారు. పరీక్షించిన డాక్టర్ కృష్ణాప్రసాద్ సూది మందు వేసిన కాసేపటికి రంగయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పరిస్థితి చేజారుతున్నట్లు గమనించిన డాక్టర్ వెంటనే... ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని రోగి కుటుంబసభ్యులకు సూచించినట్లు తెలిసింది. ఘటనపై డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. జ్వర తీవ్రత కారణంగానే రంగయ్య మృతి చెందాడని పేర్కొన్నారు. రోగి ప్రాణాలు కాపాడేందుకు తాను చేసిన ప్రయత్నాలు వివరించారు.

పంచాయితీ పెద్దలు పోలీసులేనా?

రంగయ్య మృతికి డాక్టర్ కృష్ణ ప్రసాద్‌నే కారణమంటూ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేయాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ దుప్పటి పంచాయితీకి తెరలేపినట్లు సమాచారం. వైద్యుడిని కాపాడే క్రమంలో బాధిత కుటుంబసభ్యులను రాజీ చేసి రూ.లక్ష పరిహారాన్ని డాక్టర్ కృష్ణప్రసాద్ చెల్లించేలా ఒప్పందం చేసినట్లు తెలిసింది. దీంతో వివాదం సద్దుమణిగినట్లు సమాచారం.

'108'లో ప్రసవం


శిశువును అప్పగిస్తున్న ఈఎంటీ రమాదేవి

యల్లనూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాలు... యల్లనూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన సోమేసులు, కవిత దంపతులు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడోసారి గర్భం దాల్చిన ఆమెకు నెలలు నిండి శనివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు సమాచారం అందించడంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని ఆమెను తీసుకుని అంబులెన్స్‌లో తాడిపత్రి ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో కొనగుంటపల్లి వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రమాదేవి సూచన మేరకు పైలెట్ కొండయ్య వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. కాసేపటికి ఈఎంటీ సహకారంతో పండంటి మగబిడ్డకు కవిత జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను తాడిపత్రిలోని ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ధ్రువీకరించారు. కాగా, ఫోన్ చేసిన వెంటనే స్పందించిన 108 సిబ్బందికి సోమేసుల కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

దంపతులు.. భలే దొంగలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చోరీలకు పాల్పడుతున్న దంపతులను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ రవిశంకరరెడ్డి వెల్లడించారు. నాయక్‌నగర్‌లో నివాసముంటున్న మురళి, జ్యోతి దంపతులు. భర్త ఆటో నడుపుతుండగా తోడుగా భార్య కూడా సాధారణ ప్రయాణికురాలిగానే ఆటోలో ప్రయాణిస్తూ నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే ప్రయాణికుల వద్ద ఉన్న విలువైన వస్తువులు అపహరించుకెళ్లేవారు. ఇటీవల ఒంగోలుకు చెందిన వెంకట్రావుని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆటో ఎక్కించుకుని సెల్‌ఫోన్‌తో పాటు రూ.12 వేలు లాక్కొని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో దంపతులిద్దరినీ సోమవారం అరెస్ట్ చేశారు.